సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



పూల పూజకు వేళాయె..

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ. ఈ పండుగ వచ్చిందంటే పూల పరిమళాలు వెదజల్లుతాయి. 10లో▸



అలైన్‌మెంట్ మార్చేలా..

రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చేలా చూడాలని ఎంపీ డీకే అరుణకు పలువురు రైతులు విన్నవించారు. 10లో▸



పింఛన్లు పెంచి ఇవ్వాలి

వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు పెంచి ఇవ్వాలని నేతలు డిమాండ్ చేశారు. 10లో▸

న్యూస్‌రీల్

న్యాయం చేయండి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందిస్తున్న చెంచు రైతులు

కడ్తాల్: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను హైదరాబాద్ ప్రజా భవన్‌లో మండల పరిధిలోని అన్మాస్‌పల్లి, జమ్ములాబావితండాకు చెందిన చెంచు రైతులు కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఆమెకు వివరించారు. 1988లో అప్పటి ప్రభుత్వం అన్మాస్‌పల్లి, జమ్ములాబావితండాకు చెందిన 27 మంది రైతులకు 54 ఎకరాలు కేటాయించిందని తెలిపారు. నాటి నుంచి తామే సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. 30 ఏళ్లుగా సేద్యం చేసుకుంటున్న తమ భూములకు భూ భారతిలో పట్టాలిప్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు స్పందించిన మంత్రి కలెక్టర్ నారాయణరెడ్డికి ఫోన్ చేసి న్యాయం చేయాలని సూచించారు.

సీపీఐ మహాసభలకు ప్రతినిధిగా ఓరుగంటి



ఓరుగంటి యాదయ్య

తుర్కయంజాల్: పంజాబ్ రాష్ట్రంలోని చండీగఢ్‌లో ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న సీపీఐ జాతీయ మహాసభలకు ప్రతినిధిగా జిల్లా నుంచి ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సభల్లో దేశ రాజకీయాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పార్టీ అభివృద్ధి, అంతర్జాతీయ పరిస్థితులు, కార్పొరేట్ శక్తుల ప్రభావం, మత రాజకీయాలు వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. సభల్లో పాల్గొనే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు.

కేసుల దర్యాప్తులో పారదర్శకత తప్పనిసరి



పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న శంషాబాద్ డీసీపీ రాజేశ్

కడ్తాల్: కేసుల నమోదు.. దర్యాప్తు ప్రక్రియలో పారదర్శకతతో వ్యవహరించాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రికార్డులు, కేసుల నమోదు ప్రక్రియ, సిబ్బంది పనితీరు, కేసుల పురోగతిని పరిశీలించారు. పోలీసు సిబ్బందిని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలతో ఠాణాను ఆశ్రయించే ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ గంగాధర్, ఎస్‌ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలతో నిఘా పటిష్టం

సీసీ కెమెరాల ఏర్పాటుతో నిఘా వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు నేరాలను అరికట్టవచ్చని శంషాబాద్ డీసీపీ రాజేశ్ అన్నారు. మండల పరిధిలోని చరికొండలో ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను శనివారం వారు ప్రారంభించారు. అదే విధంగా రక్తదాన శిబిరం ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ గంగాధర్, ఎస్‌ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొంగరకలాన్‌లో హైడ్రా అధికారుల పర్యటన

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్‌లో హైడ్రా అధికారులు పర్యటించారు. హైడ్రా సీఐ పి.తిరుమలేష్ కొంగరకలాన్‌లోని ఐరా స్క్వేర్ రియల్ ఎస్టేట్ సంస్థలో దేవరకొండ నక్ష రోడ్డు ఆక్రమించి గోడలు నిర్మించారని, పక్కనే ఉన్న శ్లోకా కన్వెన్షన్ హాల్ యజమాని మున్సిపాలిటీకి గిఫ్ట్‌డీడ్ చేసిన విలువైన స్థలాన్ని కబ్జా చేశారని కొంగరకలాన్‌కు చెందిన కొంతమంది హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం పర్యటించిన అధికారులు రెండు చోట్ల వివరాలు సేకరించారు. యాజమాన్యాన్ని పిలిచి కార్యాలయానికి విచ్చేసి సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు.



కడ్తాల్: ఓ పాఠశాలలో నిర్వహించిన వేడుక



కడ్తాల్: బతుకమ్మతో చిన్నారి

ఆట.. పాట..
రంగుల పూదోట



బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ బతుకమ్మ సంబరాలు మొదలయ్యాయి. ఆదివారం నుంచి దసరా సెలవులు కావడంతో శనివారం ఒకరోజు ముందుగానే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఒకచోట చేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ఉత్సాహంగా గడిపారు.



ఆమనగల్లు: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



షాబాద్: ఓ స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు

‘బినామీ’ పనులు!

- డిస్కం వర్కుల్లో ఇంజినీర్ల బంధుగణం
- ఆన్‌లైన్ టెండర్లే కాదు ప్రైవేటు పనులూ వారికే
- ఒక్కో సెక్షన్‌కు ఇద్దరు ముగ్గురు కాంట్రాక్టర్లు
- ఏసీబీ దాడులు.. సీఎంఓ ఆరాతో ఉక్కిరిబిక్కిరి



పుప్పాల్‌గూడలోని ఓ భవనం కోసం పై నుంచే పరిచిన యూజీ కేబుళ్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: నానక్‌రాంగూడలోని ఓ కాన్సులేట్ కార్యాలయం విద్యుత్ కనెక్షన్ కోసం ఆరేళ్ల క్రితం కేటగిరీ–2 కింద డిస్కంకు దరఖాస్తు చేసుకుంది. ఖరీదైన పనులను తమ ఖాతాలో వేసుకోవాలని అప్పటి ఇంజనీర్లు భావించారు. ప్రాజెక్ట్స్ విభాగం చేపట్టాల్సిన పనులను నిబంధనలకు విరుద్ధంగా నాటి ఆపరేషన్స్ విభాగం చేజిక్కించుకుంది. అధికారులు ఎక్కడా తెరపై కనిపించకుండా బినామీ కాంట్రాక్టర్‌ను రంగంలోకి దింపారు. నానాక్‌రాంగూడ 33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి 26 కిలోమీటర్లు, గచ్చిబౌలి 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి 12.09 కిలోమీటర్లు యూజీ కేబుల్ వేయాలని నిర్ణయించి.. ఆ మేరకు లైన్ ఫీజుబులిటీ, లోడును సాకుగా చూపించి అంచనాలను అమాంతం పెంచేశారు. యూజీ కేబుల్స్ కోసం డిగ్గింగ్ వర్క్స్ చేయకుండానే చేసినట్లు రికార్డులు చూపించారు. పనులు చేసేది, పర్యవేక్షించేది అధికారులే కావడంతో ఎవరికీ అనుమానం రాకుండా అదే మార్గంలో ఓ ప్రైవేటు డేటా సెంటర్ కోసం తవ్విన ట్రెంచ్(లైన్) నుంచే సదరు కాన్సులేట్‌కు కేబుళ్లను వేశారు. అప్పట్లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. డీటీఆర్ చార్జింగ్ ప్రక్రియ మూడేళ్ల క్రితమే పూర్తయింది. ఇలా మిగిల్చిన దాంట్లో క్షేత్రస్థాయిలోని నాటి డీఈ మొదలు.. ఓ రిటైర్డ్ డైరెక్టర్ స్థాయి అధికారి వరకు భారీగా లబ్ధిపొందినట్లు ఆరోపణలున్నాయి. కొత్తగా వచ్చిన ఏడీఈ పనులపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సెక్యూరిటీ డిపాజిట్ రూ.31.61 లక్షలు తిరిగి చెల్లించాలంటే.. వేసినట్లు చెబుతున్న భూగర్భలైన్‌ను తవ్వి చూపించాల్సిందేనంటూ పట్టుబట్టారు. తవ్వితే అక్రమాలు ఎక్కడ భయటపడతాయో అనే భయంతో సదరు బినామీ కాంట్రాక్టర్ ఆ డిపాజిట్ జోలికే వెళ్లలేదు.

రూ.లక్షల్లో వేతనాలు..అయినా అడ్డదారులు

గ్రేటర్ జిల్లాల పరిధిలో మూడు జోన్లు, తొమ్మిది సర్కిళ్లు, 26 డివిజన్లు, 65 ఆపరేషన్స్ సబ్ డివిజన్లు, 213 ఆపరేషన్ సెక్షన్లు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పని చేసే ఆర్టిజన్ కార్మికులు వేతనాలు రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు ఉండగా, రెగ్యులర్ జూనియర్ లైన్‌మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్ల జీతాలు సీనియార్టీని బట్టి రూ.లక్ష వరకు ఉన్నాయి. అసిస్టెంట్ ఇంజినీర్ల(ఏఈ) వేతనాలు రూ.లక్ష నుంచి రూ.1.5లక్షల వరకు ఉండగా, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు(ఏడీఈ), డివిజనల్ ఇంజినీర్ల(డీఈ) జీతాలు రూ.3.5 లక్షల నుంచి రూ.4.5 లక్షల వరకు ఉంటాయి. సూపరింటెండింగ్ ఇంజనీర్లు (ఎస్ఈలు), చీఫ్ ఇంజనీర్ల (సీఈ)ల వేతనం రూ.7 లక్షలకుపైగా ఉంటోంది. ఒకవైపు రూ.లక్షల్లో వేతనాలు పొందుతూనే మరోవైపు గుట్టుగా ప్రైవేటు పనులు చేపిస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులతో బినామీ పనులు చేయిస్తున్నారు. తొలుత నామినేటెడ్ పద్ధతిలో చిన్నచిన్న పనులు కేటాయించి, తర్వాత తమ అధికారాన్ని అడ్డుపెట్టుకుని భారీ మొత్తంలో దక్కించుకుంటున్నారు. విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న హైరేజ్ బిల్డింగ్స్, మల్టీ స్టోరేజ్ భవనాలు, పరిశ్రమల యజమానులకు లైన్ ఫీజుబులిటీ, లోడు సాకుగా చూపించి.. తక్కువకు అయ్యే పనులకు ఎక్కువ మొత్తంలో అంచనాలు రూపొందిస్తున్నారు. అనంతరం బినామీలకు ఆయా దరఖాస్తుదారుల ఫోన్ నంబర్లు, అడ్రస్‌లు ఇచ్చి రీ ఎస్టిమేషన్ల పేరుతో మళ్లీ అదే పనికి తక్కువ ఎస్టిమేషన్ వేస్తున్నారు. ఆయా భవనాలు/పరిశ్రమ యజమానులు వీరికి తలొగ్గక తప్పని పరిస్థితి తలెత్తుతోంది. ఇలా ఆపరేషన్స్ విభాగంలోని ఏఈ, డీఈలే కాదు సాధారణ ఆర్టిజన్ సైతం కోట్లకు పడగెత్తారంటే ఆశ్చర్యపోనవసరం లేదు. అడ్డగోలుగా సంపాదనకు అలవాటు పడిన ఇంజినీర్లు.. తర్వాత ఫోకల్ పోస్టులకు భారీగా ఖర్చు చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడిని తిరిగి సంపాదించేందుకు మళ్లీ అడ్డదారులు తొక్కుతున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన ఇంజినీర్లపై ఏసీబీ దాడులు చేస్తుండటం, సీఎంఓ ఆరా తీస్తుండటంతో ఆయా అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

బినామీ కాంట్రాక్టర్లు చేపట్టిన పనులకే ఎల్సీలు

అంచనాల రూపకల్పన, ఆన్‌లైన్ టెండర్ల దాఖలు, పనుల కేటాయింపు, పర్యవేక్షణ సహా మీటర్ల మంజూరు, డీటీఆర్ చార్జింగ్ ఇలా అన్ని తామే చూసుకుంటామని హామీ ఇస్తుండటంతో ఆయా భవన/ పారిశ్రామిక యజమానులు వీరికి పనులు కట్టబెడుతున్నారు. ఏఈ పరిధిలో సెక్షన్ కాంట్రాక్టర్లు, డీఈ పరిధిలో 33 కేవీ కాంట్రాక్టర్లు పని చేస్తుంటారు. ఆన్‌లైన్ టెండర్ ద్వారా చేపట్టాల్సిన డిపార్ట్‌మెంట్ పనులను సైతం ఎమర్జెన్సీ వర్కుల పేరుతో బినామీలతో చేయిస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకు లైసెన్సులు లేని వ్యక్తులు కూడా పనులు చేసుకునే వారు. వీరంతా తమకున్న అనుభవం, అర్హతను బట్టి పనులు చేసేవారు. ఇటీవల ప్రభుత్వం పలు మార్పులు చేసింది. విద్యుత్ పనులు చేయాలంటే ఎలక్ట్రిల్ లైసెన్సింగ్ బోర్డు గుర్తింపు పొందిన వ్యక్తితో మాత్రమే పనులు చేయించాలనే నిబంధన విధించింది. ప్రతి కాంట్రాక్టర్ ఆన్‌లైన్ వెండర్ రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలి. డిస్కం పరిధిలో మూడు వేలకుపైగా ప్రైవేట్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు ఉండగా, కొద్ది మందికి మాత్రమే పనులు దక్కుతున్నాయి. ఆన్‌లైన్‌లో తక్కువకు కోట్ చేసిన వారికి పనులు ఇవ్వకుండా వివిధ సాంకేతిక అంశాలను కారణంగా చూపించి, అవే పనులను బినామీలకు కట్టబెడుతున్నారు. ఇలా ఒక్కో సెక్షన్‌కు ఇద్దరు బినామీ కాంట్రాక్టర్లు ఉన్నట్లు తెలిసింది. బినామీ కాంట్రాక్టర్లకు ఎల్సీలు ఇస్తూ.. ఇతరులు చేసిన పనులకు ఇవ్వడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. సకాలంలో డీటీఆర్ ఛార్జింగ్ చేయించకపోవడంతో బిల్డర్లు తమతో ఒప్పందాలు రద్దు చేసుకుంటున్నారు. ఫలితంగా ఏళ్లుగా చిన్నచిన్న పనులు చేసుకుని బతికిన వాళ్లు ప్రస్తుతం బినామీలతో పోటీ పడలేకపోతున్నారు.

నిర్లక్ష్యాన్ని ఏమనాలా?



నెర్రెలు బారిన నాలా

- మాసబ్ చెరువు వాగుపై నెర్రెలుబారిన నాలా
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు
- పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోళ్లు
- పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని ఆపిల్ అవెన్యూ కాలనీలో మాసబ్ చెరువు వాగుపై నిర్మించిన నాలా నెర్రెలు బారింది. కూలడానికి సిద్ధం అన్నట్లు ఉన్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. వాగుపై నిర్మాణం కాబట్టి ఇరిగేషన్ శాఖ చూడాలని మున్సిపల్ అధికారులు.. వెంచర్ ఏర్పాటై ఇళ్ల నిర్మాణమైనందున మున్సిపల్ అధికారులదే బాధ్యత అని ఇరిగేషన్ అధికారులు ఒకరిపై ఒకరు చెబుతూ చేతులు దులుపుకొంటున్నారు. దీంతో సమస్య ఇప్పట్లో కొలిక్కి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

వాగును నాలాగా మార్చడంతో..

2015లో వెంచర్ చేసిన నిర్వాహకులు పెద్ద వాగును చిన్న నాలాలా మార్చారు. ఫలితంగా అలుగు పారినప్పుడల్లా రెండు వైపులా రాకపోకలు నిలిచిపోతున్నాయి. వరద సహజసిద్ధంగా ప్రవహించే అవకాశం లేకపోవడంతో నాలాపై ప్రవహిస్తోంది. దీనిపై వేసిన స్లాబ్‌ను సీసీ రోడ్డుగా మార్చారు. వాగుకు రెండు వైపులా ఉన్న ఇళ్లకు వెళ్లడానికి ఇదే మార్గం. 2020 అక్టోబర్ 12న కురిసిన భారీ వర్షంతో రాత్రికిరాత్రే చెరువు ఉప్పొంగడంతో వాగు ఉధృతంగా ప్రవహించి ఇళ్లను ముంచెత్తిన విషయం విదితమే. తరువాత ఏటా కురుస్తున్న వర్షాలతో మూడు, నాలుగు నెలలకుపైగా నాలా నుంచి నీరు ప్రవహిస్తోంది. నెర్రెలు బారి కూలడానికి సిద్ధంగా ఉంది. ఇప్పటికే రెండు వైపులా నీరు ప్రవహించే చోట కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని ‘సాక్షి’ ముందే హెచ్చరించింది.

తెరుచుకున్న మ్యాన్ హోళ్లు

ఇటీవల జీహెచ్‌ఎంసీ పరిధిలోని మల్లేపల్లిలో అర్జున్, రాము అనే యువకులు, ముషీరాబాద్‌లో సన్నీ అనే యువకుడు భారీ వర్షాలతో వచ్చిన వరద నీటి కారణంగా నాలాలో కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. వారి జాడ కోసం అధికార యంత్రాంగం చేస్తున్న ప్రయత్నం అంతా ఇంతా కాదు. ఇలాంటి సంఘటనలు చూసినప్పుడైనా అధికారుల్లో చలనం రావడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మాసబ్ చెరువు వాగుపై నిర్మించిన నాలా నిండుగా ప్రవహిస్తున్నా మ్యాన్‌హోళ్లపై కనీసం మూతలు కూడా పెట్టలేదు. ఒకటి రెండు చోట్ల పెట్టినా వరద ఉధృతికి అవి తట్టుకోవడం లేదు. ఇక్కడ నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో పాటు చుట్టు పక్కల ఇళ్లలో నివసించే పిల్లలు ఆడుతూ ఉంటారు. ఏదైనా ప్రమాదం జరిగాక విచారించే బదులు ముందస్తుగా స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

“ వాగుపై నిర్మాణమే తప్పు

సహజసిద్ధంగా ఏర్పడిన వాగుపై నాలా నిర్మించడమే తప్పు. గతంలో వెంచర్ చేసిన నిర్వాహకులు వరద నీటి కోసం నాలా నిర్మించారు. పదేళ్లు కూడా కాకముందే నెర్రెలు బారిన మాట వాస్తవమే. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. నిర్మాణంపై మున్సిపల్ అధికారులు నిర్ణయం తీసుకోవాలి.

– వంశీ, ఏఈఈ, ఇరిగేషన్

చర్యలు తీసుకుంటాం

ప్రస్తుతం ఉన్న నాలా వరుసగా కురుస్తున్న వర్షాలతో కొంత మేర ధ్వంసమైంది. రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు తెరుచుకున్న మ్యాన్‌హోళ్లను వెంటనే మూసివేయిస్తాం. వర్షాల వేళ ప్రజలు కూడా అప్రమత్తంగా వ్యవహరించాలి.

– కె.అమరేందర్ రెడ్డి, కమిషనర్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ



నిండుగా నీరు ప్రవహిస్తుండడంతో పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోళ్లు

కోర్టు ఉత్తర్వులు అమలు చేయండి



కలెక్టర్ నారాయణరెడ్డితో సమావేశమైన ఫార్మాసిటీ భూ బాధితులు

యాచారం: ఫార్మాసిటీ భూసేకరణ విషయంలో కోర్టు ఉత్తర్వులను అమలు చేసి, టీజీఐఐసీ పేరు మీద మార్చేసిన రికార్డులను తిరిగి రైతుల పేర్లపై నమోదు చేసేలా కృషి చేయాలని ఫార్మాసిటీ భూ బాధితులు కలెక్టర్ నారాయణరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన పలువురు రైతులు కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డితో సమావేశమయ్యారు. భూసేకరణకు వ్యతిరేకంగా హైకోర్టు జారీ చేసి ఉత్తర్వుల పత్రాలను కలెక్టర్‌కు అందించారు. ఆన్‌లైన్‌లో భూ రికార్డులను నమోదు చేయాలని ఉత్తర్వులున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. స్పందించిన కలెక్టర్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి నేతలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు భూ బాధితుల విజ్ఞప్తి

పింఛన్లు పెంచి ఇవ్వాలి



మహేశ్వరం: నాగారంలో మాట్లాడుతున్న ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు మాదిగ

మహేశ్వరం: వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్లు పెంచి ఇవ్వాలని జిల్లా మహాజన సమితి అధ్యక్షుడు రావుగళ్ల బాబు మాదిగ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని నాగారం, కల్వకోల్, ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి, మన్సాన్‌పల్లి, మహేశ్వరం, గంగారం, పెండ్యాల, నాగిరెడ్డిపల్లి, గొల్లూరు, సుభాన్‌పూర్, తుమ్మలూరు గ్రామాల్లో శనివారం ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టి కార్యదర్శులుకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు పింఛన్లు పెంచి ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఇవ్వకుండా మోసం చేశారని అన్నారు. కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారితో పాటు పాతవారికి వెంటనే పింఛన్లు పెంచి ఇవ్వాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి బక్కని రవి మాదిగ, మండల అధ్యక్షుడు ఎర్ర గణేష్ మాదిగ, ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు ఎర్ర కృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

హామీ నిలబెట్టుకోవాలి

షాద్‌నగర్‌రూరల్: ఎన్నికల సమయంలో పెన్షన్‌పై ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ డిమాండ్ చేశారు. ప్రభుత్వం కొత్త పెన్షన్లను మంజూరు చేయడంతో పాటు పాత పెన్షన్లను పెంచాలని కోరుతూ శనివారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నాగభూషణం ఆధ్వర్యంలో పంచాయితీ కార్యాలయాల్లో పెన్షన్‌దారులతో కలిసి ధర్నా చేపట్టి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షన్ల పెంపు కోసం దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు 22 నెలలుగా ఎదుచూస్తున్నారని అన్నారు. పాత పెన్షన్లను పెంచడంతో పాటు కొత్త పెన్షన్లు మంజూరు చేసేవరకు సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్రాన్ని పాలించే నైతిక హక్కు లేదన్నారు. కార్యక్రమంలో శివ, యాదగిరి, సాయిలు, అంజి, సువర్ణ, రాంచంద్రయ్య, జంగయ్య, మల్లయ్య, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



పంచాయితీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రమాదం

తాండూరు రూరల్: అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ సంఘటన పెద్దేముల్ మండలం తింసాన్‌పల్లి వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం..పెద్దేముల్ మండలం నాగులపల్లికి చెందిన సిద్ధారెడ్డి ట్రాక్టర్ శనివారం ఉదయం పెద్దేముల్‌కు వస్తుండగా మార్గ మధ్యలో తింసాన్‌పల్లి వద్ద బోల్తా పడింది. వెంటనే డ్రైవర్ తప్పించుకోవడంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. అనంతరం జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌ను పైకి తీశారు.

పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం



నజినీ కాతూన్(ఫైల్)

పహాడీషరీఫ్: ముగ్గురు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం అయింది. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన అతికుర్ రెహమాన్, భార్య నజినీ కాతూన్(32), ముగ్గురు పిల్లలు దిల్‌నవాజ్(11), హమ్మత్(9), ఫవద్(6)లతో కలిసి జీవనోపాధి నిమిత్తం రెండేళ్ల క్రితం మామిడిపల్లికి వలస వచ్చారు. రెహమాన్ స్థానికంగా ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 17న కూరగాయలు తెచ్చేందుకు వెళ్లి తిరిగి వచ్చిన రెహమాన్‌కు ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ కనిపించలేదు. వారి కోసం గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. భార్య ఫోన్ స్విచ్చాఫ్ ఉంది. దీంతో సదరు వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్, లేదా 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

అమ్మగారింటికి వెళ్లొస్తానని..

శంకర్‌పల్లి: అమ్మగారింటికి వెళ్లి వస్తానని వెళ్లిన గృహిణి అదృశ్యం అయింది. ఈ సంఘటన శంకర్‌పల్లి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని రెడ్డికాలనీలో నగేష్(38), శివాని(22) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు(8), కుమార్తె(6) ఉన్నారు. నగేష్ సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 18న శివాని తన ఇద్దరూ పిల్లలను పాఠశాలకు పంపించింది. ఉదయం 9 గంటల తర్వాత భర్తతో అమ్మగారింటికి(కొండకల్ గ్రామం) వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. కానీ రాత్రి అయినా ఆమె తిరిగి రాలేదు. ఆమె కోసం చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు.దీంతో ఆమె భర్త ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పూల పూజకు వేళాయె..



షాబాద్‌లో బతుకమ్మలతో మహిళలు (ఫైల్)

- నేటి నుంచి ఊరూవాడా బతుకమ్మ సందడి
- ఎంగిలిపూలతో మొదలై సద్దులతో ముగింపు
- ఆట పాటలతో యువతుల సంబురాలు

షాబాద్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ. ఈ పండుగ వచ్చిందంటే పల్లె, పట్టణం తేడా లేకుండా పూల పరిమళాలు వెదజల్లుతాయి. గునగు, తంగేడు, పట్టుకుచ్చులు, బంతి, చామంతి, రుద్రాక్ష, గోరింట ఇలా తీరొక్క పువ్వును బతుకమ్మను ఆహ్వానిస్తుంది. అలాంటి పూల పూజను నేటి నుంచి అంగరంగ సంబరంగా ఆడబిడ్డలు జరుపుకోనున్నారు. ఎంగిలిపూలు మొదలు సద్దులు వరకు తొమ్మిది రోజుల పాటు బతుకమ్మను ఆటపాటలతో ఆరాధించనున్నారు.

మెట్టినింటి నుంచి..

ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే పూల పండుగ బతుకమ్మ అంటే.. ఆడబిడ్డలకు ఎంతో ఇష్టం. ఈ సందర్భంగా అతివలు అత్తింటి నుంచి పుట్టింటికి చేరుకుంటారు. ప్రకృతిలో లభించే తీరొక్క పూలను సేకరించి, బతుకమ్మలను పేర్చి, గౌరమ్మను పూజిస్తారు.

ఒక్కో రోజు ఒక్కో పేరు..

తొలిరోజు బతుకమ్మను ఎంగిలిపూల బతుకమ్మ అంటారు. ముందురోజు కోసిన పూలను నీళ్లలో వేసి, మరునాడు అలంకరణకు వాడటం వలన ఇలా పిలుస్తారు. రెండో రోజు అటుకుల, మూడో రోజు ముద్దపప్పు, నాలుగో రోజు నానబియ్యం, అయిదో రోజు అట్ల, ఆరో రోజు అమ్మవారు అలకలో ఉంటుందని నమ్మి, బతుకమ్మ ఆడరు. ఏడో రోజు వేపకాయల, ఎనిమిదో రోజు వెన్నముద్దల, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ అంటారు. చివరి రోజు ఆడబిడ్డలు ఆడిపాడి, పోయిరా బతుకమ్మ పోయిరావమ్మా.. మళ్లొచ్చే ఏడాదికి తిరిగి రావమ్మా.. అని వీడ్కోలు పలుకుతారు. నీళ్లలో నిమజ్జనం చేశాక.. వాయినం ఇచ్చి పుచ్చుకుంటారు.

ఇంటి దేవతగా కొలుస్తాం



తెలంగాణ పండుగ బతుకమ్మ. బొడ్డెమ్మ మొదలు సద్దుల వరకు రోజుకో ప్రత్యేకత ఉంది. బతుకమ్మను ఇంటి దేవతగా కొలుస్తాం. నా చిన్ననాటి నుంచి మా ఇంట్లో అమ్మమ్మ, అమ్మ అక్కలతో కలిసి బతుకమ్మను అలంకరించడం, అందులో నైపుణ్యాన్ని ప్రదర్శించడం చాలా సంతోషంగా ఉంటుంది. పోటా పోటీగా బతుకమ్మను పేరుస్తాం.

– శోభ, చందనవెళ్లి, షాబాద్

అప్పట్లో పోటీపడేవారు



అప్పట్లో బతుకమ్మ పాటలు పాడేందుకు పోటీ పడేవారు. మగవాళ్లు గునుగు, తంగేడు, ఇతర పూలు తెచ్చేవారు. ఇప్పుడు ఎవరో పాడిన పాటలు పెట్టి, కోలాటం ఆడటం, చప్పట్లు కొట్టడం తప్ప.. పాడేవారు లేరు. తెలంగాణ వచ్చాక బతుకమ్మకు పేరొచ్చినా, నాటి పాటలు, సంస్కృతిని మరిచిపోతుండటం బాధగా ఉంది.

– అపర్ణ, ఎంపీడీఓ, షాబాద్

ఆడబిడ్డల పండుగ



పుష్పోత్సవం.. ఆడబిడ్డల పండుగ. ఊరంతా సందడిగా ఉంటుంది. తొమ్మిది రోజులు రోజుకో పేరుతో ఆడుతం. ఎక్కడ ఉన్నా.. ఈ సంబురానికి సొంతూరికి వెళ్తాం. ఈ పండుగ ప్రకృతిని, దేవుడిని పూజించడంతో పాటు చల్లని శీతాకాలం ప్రారంభాన్ని సూచిస్తుంది. బతుకమ్మ పండుగ మహిళలకు ప్రత్యేకంగా ఉండటం మా అదృష్టం.

– సృజన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, షాబాద్

పువ్వులను కీర్తిస్తూ..



బతుకమ్మ పాటల్లో కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి ఉంటుంది. రకరకాల పువ్వులు రంగులలో పూసి ఉంటాయి. వీటిలో గునుగు పూలు, తంగేడు పూలు ఎక్కువగా పూస్తాయి. బంతి, చామంతికి ఇదే సమయం, ఆడపడుచులు ప్రకృతి సౌందర్యాన్ని అద్భుతమైన తీరొక్క పూలతో కీర్తిస్తూ సంబురం చేసుకుంటారు. ఈ పండుగ తెలంగాణలో సౌందర్యం, ఆత్మగౌరవం పెంపొందిస్తుంది.

– ఆశ్రిత, పంచాయతీ కార్యదర్శి, కుమ్మరిగూడ, షాబాద్

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చేలా చూడండి



ఎంపీ డీకే అరుణను కలిసిన రైతులు

షాద్‌నగర్: రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చేలా చూడాలని కోరుతూ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణకు పలువురు రైతులు విన్నవించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కొందుర్గు మండలం తంగెళ్లపల్లి, ఆగిర్యాల, చెరుకుపల్లి, గంగన్నగూడ, కేశంపేట మండలం తొమ్మిదిరేకుల, లింగంధన, నిర్దవెల్లి, ఫరూఖ్‌నగర్ మండలం చించోడ్, ఉప్పరిగడ్డ, భీమారం, చౌదరిగూడ మండలం తూంపల్లి, వనంపల్లి, తుమ్మలపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు శనివారం మహబూబ్‌నగర్ వెళ్లి ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ట్రిపుల్ ఆర్ రోడ్డు తమ గ్రామాల మీదుగా వెళ్తోందని, రోడ్డు నిర్మిస్తే తమకున్న కొద్ది పాటి వ్యవసాయ భూములు కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీని కలిసిన వారిలో చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి, నర్సింహ యాదవ్, ఇస్నాతి శ్రీనివాస్, బల్వంత్‌రెడ్డి, సుధాకర్ అప్ప, నరేందర్‌రెడ్డి, అశోక్, అనిల్‌కుమార్, యుగంధర్, బాలరాజు తదితరులు ఉన్నారు.

తనయుడి చేతిలో తల్లి హత్య!

చేవెళ్ల మండలం రేగడిఘనాపూర్‌లో ఘటన



నర్సమ్మ (ఫైల్)

చేవెళ్ల: కన్నతల్లిని కర్కశంగా హత్య చేశాడో దుర్మార్గుడు. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలోని రేగడిఘనాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొంగుపల్లి నర్సమ్మ (70)కు నలుగురు కొడుకులు. అందరికీ వివాహాలు కాగా వేర్వేరుగా జీవిస్తున్నారు. భర్త చనిపోవటంతో వృద్ధురాలు ఒంటరిగా ఉంటోంది. మూడో కొడుకు జంగయ్య పెళ్లి చేసుకుని, వికారాబాద్ జిల్లా పూడూరు మండలం అంగడిచిట్టెంపల్లికి ఇల్లరికం వెళ్లాడు. సొంత మామ(భార్య తండ్రి) హత్య ఘటనలో ఇతనిపై కేసు నమోదైంది. దీంతో భార్యతో గొడవ పడి ఆర్నెళ్లుగా స్వగ్రామానికి వచ్చి తల్లితోనే ఉంటున్నాడు. గతంలో చేసిన ప్రైవేటు ఉద్యోగం మానేసి, తాగుడుకు బానిసయ్యాడు. ఇదిలా ఉండగా గత శుక్రవారం రాత్రి బాగా తాగి వచ్చి మత్తులోనే నిద్రపోయాడు. శనివారం మధ్యాహ్నం వరకూ తల్లీకొడుకులు బయటకు రాలేదు. మద్యం మత్తు కాస్త దిగిన తర్వాత 3:30 గంటలకు బయటకు వచ్చి తల్లి చనిపోయిన విషయాన్ని గ్రామస్తులకు చెప్పగా పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించగా హత్యకు గురైనట్లు గుర్తించారు. ఘటనా స్థలంలో దాడికి పాల్పడిన కొడవలిని పోలీసులు స్వాధీనం చేసుకుని, జంగయ్యను అదుపులోకి తీసుకున్నారు. జంగయ్య ఇప్పటికీ మద్యం మత్తులోనే ఉన్నాడని, ఇంకా ఎలాంటి విషయాలు చెప్పలేదని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జల్సాల కోసం చోరీల బాట

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- రూ. 18 లక్షల సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్

శంషాబాద్: ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు బాల్యస్నేహితులు నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో చిన్నాచితకా ఉద్యోగాలు చేస్తున్నారు. తమ సరదాలు తీర్చుకునేందుకు చోరీల బాట పట్టిన వారు పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్ గౌడ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి..

ఒకే ఊరి నుంచి బతుకుదెరువుకు వచ్చి..

నాగర్ కర్నూల్ జిల్లా, తాడూరు మండలం, బలన్‌పల్లి గ్రామానికి చెందిన గుల్లు శివప్రసాద్, దంగట్ల లోకేష్, మండలి మనోహర్ స్నేహితులు వీరు ముగ్గురు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ కూకట్‌పల్లిలోని హాస్టల్‌లో ఉంటున్నారు. జల్సాలకు అలవాటు పడిన వారు చోరీలు బాటపట్టారు. ఈ నెల 9న స్థానిక రాఘవేంద్రకాలనీలో ఓ ఇంటి తాళం పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు. శుక్రవారం రాత్రి మధురానగర్‌లో తనిఖీలు చేపట్టిన పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా గతంలో ఆర్‌జీఐఏ, కూకట్‌పల్లి తాడూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఐదు చోట్ల బంగారం, వెండి ఆభరణాలతో పాటు మూడు బైక్‌లను చోరీ చేసినట్లు అంగీకరించారు. వారి నుంచి 17 తులాల బంగారం, 50 తులాల వెండి, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు, పోలీసు సిబ్బందికి ఏసీపీ రివార్డులు అందజేశారు.

డెంగీ లక్షణాలతో చిన్నారి మృతి!

గ్రామంలో ఫీవర్ సర్వేనిర్వహించిన వైద్య సిబ్బంది



ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తూరు: డెంగీ లక్షణాలతో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధి ఎస్‌బీపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వసుప్రియ(8) స్థానిక పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. మూడు రోజులుగా బాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా.. తండ్రి రమేష్, కోళ్లపడక్‌లో ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించాడు. కాగా ఆదివారం రాత్రి చిన్నారి ఆరోగ్యం మరింత క్షీణించగా.. నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. డెంగీతోనే చనిపోయినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న వైద్యురాలు దీప్తి, సిబ్బందితో కలిసి గ్రామంలో పలువురికి ఫీవర్ పరీక్షలు నిర్వహించారు. ఎవరూ జ్వరంతో బాధపడుతున్నట్లు తమ దృష్టికి రాలేదని తెలిపారు. చిన్నారి డెంగీతో మృతి చెందిందా, ఇతర అనారోగ్య సమస్యలతోనా అనేది వైద్య పరీక్షల్లో తేలనుందన్నారు.

వైద్యం వికటించి బాలిక మృతి

- వనస్థలిపురం తన్వి ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం
- ఆసుపత్రిపై కేసు నమోదు



నిహారిక (ఫైల్)

హస్తినాపురం: వైద్యం వికటించి బాలిక మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా, పోచంపల్లి మండలం, భీమనపల్లి గ్రామానికి చెందిన డి.శేఖర్, జ్యోతి దంపతుల కుమార్తె నిహారిక (11) ఈ నెల 18న ఆడుకుంటూ నోటిలో రూ.10 బిల్ల వేసుకోవడంతో ప్రమాదవశాత్తు అది గొంతులో ఇరుక్కుపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను హుడాసాయినగర్ కమాన్ సమీపంలోని తన్వి ఆసుపత్రిలో చేర్పించారు. చిన్నారి గొంతులో ఇరుక్కున్న కాయిన్ తొలగించిన వైద్యులు శుక్రవారం ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ చేశారు. అయితే బాలికకు మత్తు మందు ఎక్కువ మోతాదులో ఇవ్వడంతో అపస్మారక స్థితికి చేరుకుంది శనివారం ఉదయం ఎంత లేపినా నిద్ర లేవకపోవడంతో మళ్లీ తన్వి ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆమెను పరీక్షించిన ఆసుపత్రి నిర్వాహకుడు రాము బాలిక అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించాడు. దీంతో ఆగ్రహానికి లోనైన బాలిక తల్లిదండ్రులు ఆసుపత్రిలో డాక్టర్లు ఎవరూ లేరని డాక్టర్‌గా చెలామని అవుతున్న రాము వైద్యం చేయడం వల్లనే తమ కుమార్తె మృతి చెందిందని ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వారి బంధువులు, గ్రామస్తులు పెద్దఎత్తున తరలి రావడంతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న వనస్థలిపురం సీఐ మహేశ్, సిబ్బందితో అక్కడికి వచ్చి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. బాలిక తండ్రి డి.శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.